# గాజుగ్లాస్

— మహర్షి

సుధాకర్‌ని బలవంతాన ఓ హోటల్‌కు లాక్కెళ్ళాడు చిట్టిబాబు. ఇద్దరూ లోపలకెళ్ళి కూర్చోగానే క్లీనర్ వచ్చాడు.

"వేడివేడిగా ఏమున్నాయ్?" చిట్టిబాబు అడిగాడు.

"ముందు లేవండి" అన్నాడు వాడు సీరియస్‌గా.

లేవమంటున్నాడు కొడతాడేమో! గొణిగాడు సుధాకర్ లేస్తూ. చిట్టిబాబుకు అర్థం కాక లేచి నిలబడ్డాడు.

"మీరు సణిగినా, గొణిగినా నాకు అర్థం అవుతుంది. అనవసరంగా నోరు జారకండి. నేను చేయి జారవలసి వస్తుంది" అని పరపరమని టేబుల్ క్లీన్ చేసి కూర్చోమని సైగ చైసి, ఓ ఫోజు విసిరి "నేను సప్లయిర్‌ని కాదు, క్లీనర్‌ని. వాడు వస్తాడు కూర్చోండి. మీ ముఖాలు చూస్తుంటే ఎప్పుడూ హోటల్ ముఖం చూసినట్లు లేదు" విసురుగా వెళ్ళిపోయాడు.

"వీడి ఫోజు వీడు నాశనం కాను. ఎంత స్టయిల్ వీడికి" అన్నాడు చిట్టిబాబు.

"మవ్వు నేను తప్ప అందరు ఫోజు కొట్టేవాళ్ళే" విసుక్కున్నాడు సుధాకర్.

"మీరు ఫోజు కొట్టినట్లు అలా నోరు జారకండి. వాడు ప్రొప్రయిటర్‌గారి చిన్నబ్బాయి. గట్టిగా అన్నారంటే, అది వాడు విన్నాడంటే కోపం వచ్చి మీ ఒళ్ళు విరిచి అంట్లులోమించగలడు. ఇంతకు ఏం తగిలెయ్యాలి మీకు? గ్లాసుల్ని దభీమని టేబుల్ మీద పడేస్తూ అడిగాడు సప్లయిర్. గ్లాసులు పగిలిపోతాయేమోనని భయంగా చూశాడు సుధాకర్.

"అలా చూడకు. అవేం పగలవు" అన్నాడు మళ్ళీ.

"ఒక వేళ పగిలితే..." దీర్ఘం తీశాడు చిట్టిబాబు.

"మాకేం నష్టం లేదు. దాని ఖరీదు రెండు రూపాయలు మీ బిల్లులో కలుపుతాం" అన్నాడు వాడు కోపంగా.

"ఇది మరీ అన్యాయం" అన్నాడు చిట్టిబాబు.

"మా హోటల్ రూల్ అంతే మరి. ఇష్టం అయితే తినండి. లేకపోతే పొండి. నన్నిలాగే విసిగిస్తే నిముషానికొక గ్లాస్ పగలకొట్టి మీ బిల్‌లో కలుపుతాను జాగ్రత్త. ఇంతకు ఏం కావాలి? చిటపట లాడాడు సప్లయిర్.

"బాబ్బాబు నిన్ను విసిగించం కానీ, నీకు ప్రొప్రయిటర్ ఏమవుతారు?"

"నేను ఆయన పెద్ద కొడుకును" అతని సమాధానానికి సుధాకర్ ఉలిక్కిపడ్డాడు. చేతిలోని నీళ్ళ గ్లాస్ జారి భళ్ళున పగిలింది.

పగిలిన గ్లాస్ వంక సుధాకర్ వంక మిర్రిమిర్రి చూసి "నేను పగలగొట్ట వలసిన గ్లాస్ మీరు పగలకొట్టారు మూడు రూపాయలు ఎగ్‌స్ట్రా" అన్నాడు వాడు రుసరుసలాడుతూ.

"అదేంటి బాబూ! గ్లాస్ రెండు రూపాయిలు అన్నావు కదా! మరి మూడు రూపాయిలు అంటావేమిటి?" సందేహంగా అడిగాడు చిట్టిబాబు.

"నేను పగలగొడితే రెండు రూపాయలు. మీరు పగలగొడితే మూడు రూపాయలు. ఇంతకు టిఫిన్ కావాలా, వద్దా? ఇంకో నిమిషం ఆగితే మరో గ్లాస్ పగలకొడతాను. ఏమి తినకుండానే బిల్ అయిదు రూపాయిలవుతుంది" విసుక్కున్నాడు.

"ఏదో ఒకటి తగలెయ్!" అన్నాడు చిరాగ్గా.

"ఎక్కడ బడితే అక్కడ, ఎవరిని బడితే వాళ్ళను తగలెయ్యటానికి కుదరదు. ఒక్కసారి మీరు కిచెన్‌లోనికి రావాల్సి వుంటుంది" అరిచాడు సప్లయిర్.

"క్షమించండి బాబు! మీ హోటల్‌లో ఏం వుంటే అదే పెట్టండి. పెట్టమన్నాం కదాని వాతలు మాత్రం పెట్టకండి" అన్నాడు సుధాకర్.

సప్లయిర్ వెళ్ళిపోయాడు వీరిద్దరినీ వెర్రి వాళ్ళను చూసినట్లు చూసి.

సుధాకర్‌కు చిట్టిబాబు మీద విపరీతమైన కోపం వచ్చింది బలవంతాన తీసుకొచ్చినందుకు. చిట్టిబాబు జుట్టు అందుకుని నాలుగు గుద్దాలనిపించి, జుట్టు అందుకోబోయాడు. జుట్టు చేతికి అందలేదుకానీ, చేతికి మరో గ్లాస్ తగిలి తనువు చాలించింది. సుధాకర్ మనసులోనే బావురుమన్నాడు.

"ఇదిగో! మాటమాటకీ అలా గ్లాసులు మీరే పగలగొడితే ఎలా? నాకసలే నిముషానికొక గ్లాసు పగలగొట్టకపోతే ఏమి తోచదు. బిల్ ఆరు రూపాయలు. మళ్ళీ గ్లాస్ పగిలిందో నాక్కోపం వస్తుంది. కోపం వస్తే నేను మనిషిని కాను". కీచ్‌మని అరిచి వెళ్ళిపోయాడు సప్లయిర్. అతను లోపలికెళ్ళగానే క్లీనర్ రంగప్రవేశం చేశాడు.

"ఓ రూపాయి ఇవ్వండి" ఎమర్జీలో వున్నట్లు అడిగాడు.

ఇద్దరు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు అర్థం కాక.


"రూపాయి ఇవ్వమన్నది నేను. అలా ఒకరి మొహం ఒకరు చూసుకుంటారేమిటి?" మొహం చిట్లించి అసహనంగా అడిగాడు క్లీనర్.

"ఎందుకు క్లీనరుగారూ!" మర్యాద, కసి కలిపి కోరస్‌గా అడిగారు.

"ఎందుకా! మీరు పగలగొట్టిన గ్లాసు ముక్కలు ఎవరెత్తుతారు. మీ తాతల్లోరూపాయి యివ్వకుంటే నాక్కోపం వస్తుంది. నాక్కోపం వస్తే ఏం చేస్తానో చెప్పి వుంటాడీ సప్లయిర్".

"చెప్పాడు చెప్పాడు". చిల్లర లేక రెండు రూపాయల నోటు అందించాడు సుధాకర్.

"చిల్లర లేదు. మీరు మరోగ్లాస్ పగలగొడతారు



కదా! అప్పుడు సరి పెట్టుకుంటాము. లేచి ఆ టేబుల్ ముందుకూర్చోండి.''

ఛీ. వెధవ హోటలు. మళ్ళీ జన్మలో రాకూడదండీ హోటల్‌కు. సణుక్కుంటూ వెళ్ళి మరో టేబుల్ ముందు కూర్చున్నాడు సుధాకర్.

''అదిగో అలా సణిగితే వాకర్థం కాదనుకున్నారా? రేపటి నుండి హోటల్‌కు రాకుంటే, మెడలో టవల్ వేసి మరీ లాక్కొచ్చి టిఫిన్ తినిపించి, బిల్లు వసూలు చేసి మరీ పంపుతాం జాగ్రత్త'' అన్నాడు క్లీనర్.

మళ్ళీ ఈ చుట్టు ప్రక్కల కనబడితే చెప్పు తీసుకు తన్ను మనసులోనే అనుకున్నాడు సుధాకర్. క్లీనర్ ముక్కల్ని ఎత్తుతున్నాడు అంతలో సప్లయిర్ టిఫిన్ తీసుకొచ్చాడు.

''ఎక్కడబడితే అక్కడ కూర్చుంటే టిఫిన్ యివ్వబడదు. టిఫిన్ వాపస్ చేయబడుతుంది. బిల్లు మీనెత్తిన రుద్దబడుతుంది'' అన్నాడు రుసరుసలాడుతూ.

చిట్టిబాబును చూసి సుధాకర్ పళ్ళు పటపట కొరుకుతూ వెళ్ళి ముందుకూర్చున్న చోట కూర్చున్నాడు. టిఫిన్ ప్లేట్‌ను దభీమని ముందు పడేశాడు. కుక్క ముందు బిస్కెట్ పడేసినట్లు ఫీలయ్యాడు సుధాకర్. అనుమానంగా టిఫిన్ వైపు చూశారిద్దరూ.

సప్లయిర్ నవ్వుతూ వినయంగా చేతులు కట్టుకుని నవ్వాడు.

''ఇది ఏ ప్రాంతం బొగ్గు నాయనా'' మెల్లగా అడిగాడు సుధాకర్.

''ఇది కట్‌లెట్ సర్. మీరు కుర్రాళ్ళు కదాని, హుషారుగా వుండాలని అది తెచ్చాను. మీకు సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే ఈ కట్‌లెట్... ఎడ్వర్‌టైజ్‌మెంట్ వినిపించాడు.

''హుషారు సంగతి దేవుడెరుగు''. జీవితం మీద విరక్తి పుట్టించేలా వున్నది అనుకున్నాడు సుధాకర్.

''మీకోసం నేతిలో వేయించుకొచ్చాను. తినండిసార్!'' మరింత వినయంగా అన్నాడు. అతని వినయానికి చిట్టిబాబు అనుమానంగా చూశాడు.

''సరిసరి. మేం తింటాం. మీరు దయచేయండి'' అన్నాడు సుధాకర్ బలవంతాన నవ్వుతూ.

''మీరు తింటూ ఆనందిస్తుంటే, నేను చూసి సంతోషిస్తాను'' చేతులు నలుపుకుంటూ అన్నాడు వాడు.

కాదంటే వాడెక్కడ బలవంతాన తినిపిస్తాడోనని భయపడి కొంచెం కొంచెం తిన్నట్లు నటిస్తున్నారు.

''బాగున్నదా సార్!'' చాలా అభిమానంగా అడిగాడు.

అతని అభిమానానికి ఇద్దరికీ భయం వేసింది.

''బాగున్నది, బాగున్నది'' అన్నారిద్దరూ.

''ఏమైనా వాసన వేస్తున్నదా సార్''.

''అబ్బే లేదు లేదు'' అని చిట్టిబాబు వైపు గురగురుమని చూశాడు సుధాకర్.

''అలా చూడకురా బాబూ! అసలే కడుపులో తిప్పుతున్నట్లనిపిస్తున్నది'' చిట్టిబాబు.

అంతలో సప్లయిర్ ఓ క్షణం ఎవరినో చూస్తున్నాడు. అంతలో ఇద్దరి ప్లేట్లలో కట్‌లెట్ ఎగిరి కిటికి అవతల పడ్డాయి.

''అప్పుడే తినేశారా?'' ఆశ్చర్యంగా అడిగాడు సప్లయిర్.

చాలా ఆకలిగా వున్నది కదా! అం... ఆవురావురుమని తినేశాం'' నవ్వాడు చిట్టిబాబు.

''మీరు నవ్వుతుంటే నిజం నవ్వులాలేదు'' అన్నాడు చిట్టిబాబుని.

''పోనీ నేను నవ్వనా?'' అన్నాడు సుధాకర్.

''వద్దులే. టీ తెస్తాను''. వీళ్ళు చెప్పకుండానే పరుగెత్తాడు లోపలకు.

సుధాకర్ తలను టేబుల్ కేసి కొట్టుకోబోయాడు. చిట్టిబాబు కంగారుగా గ్లాసుల్ని పట్టుకున్నాడు.

''ఎందుకలా పట్టుకున్నావ్! క్రిందపడితే గ్లాస్‌కు వాడికి మూడు రూపాయలు నాకు రూపాయి వచ్చేవి కదా!'' కోపంగా అరిచాడు క్లీనరు.

వీళ్ళెవర్రా బాబూ! జలగల్లా పీక్కు తింటున్నారు. గొణిగాడు సుధాకర్.

''మరి మా హోటల్‌కు ఎవరూ రావడం లేదు, టిప్‌లు యివ్వడం లేదు. అందుకే ఇలా. ఏం చేయమంటారు మరి!'' వెళ్ళిపోయాడు వాడు.

సప్లయిర్ టీ తెచ్చి వాళ్ళ ముందుంచాడు వినయంగా.

వాళ్ళ మీద కోపంతో గటగటా త్రాగేశారు ఏమి అనకుండా.

''థాంక్స్'' అంటూ బిల్ కోసం పరుగెత్తాడు సప్లయిర్.

అంతలో క్లీనర్ వచ్చి ఇద్దరిని ఎగాదిగా చూసి, ''టీ మొత్తం తాగేశారా! అయితే వాడే గెలిచాడన్నమాట'' అన్నాడు ఏడుపు ముఖం పెట్టుకుని.

''గెలవడమేమిటి?'' అన్నాడు చిట్టిబాబు.

''మే మిద్దరం పందెం వేసుకున్నాంలే'' అంటూ వాడు వెళ్ళి పోయాడు.

''పందెం ఎందుకు అని అడగబోయి చెబితే రూపాయి యిమ్మంటాడేమోనని ఆగిపోయాడు చిట్టిబాబు. సప్లయిర్ బిల్ తెచ్చి ''నాకు టిప్‌లు, గిప్‌లు వద్దులెండి. గెలిచినందుకు థాంక్స్'' అన్నాడు సంతోషంగా.

నీ మోహానికి టిప్స్ కూడానా? తొక్క వలసిన ఉల్లిపాయ మొహం నువ్వునూ. అనుకుని గబగబా వెళ్ళిపోయారు బిల్ కౌంటర్‌లో చెల్లించి.

కొంత దూరం వెళ్లారో లేదో వెనక నుండి సప్లయిర్ పరుగు పరుగున వచ్చి సుధాకర్ చేతిలో ఓ కాగితం కుక్కి ''దూరంగా వెళ్ళి, తీరుబడిగా చదువుకోండిసార్!'' అని పరుగెత్తి వెళ్ళి పోయాడు.

''ఈదిక్కుమాలిన తిండికి లెటరు సందేశం'' అంటూ చిట్టిబాబు నెత్తిన ఓ మొట్టికాయి కొట్టి ముందుకు నడిచాడు.

(ఆ కాగితంలో ఏమున్నదో తెలుసుకోవాలనుకుంటే మరో సారి కలిసినప్పుడు ముచ్చటించుకుందాం. అంత వరకు కాస్త ఆగి తెలుసుకోవచ్చు కదా! మరీ టెన్షన్ ఫీలయితే ఎలాగండి బాబూ! టా... టా...)

## రతి— లవ్‌ఏక్సిడెంట్

రతి అగ్నిహోత్రి తన లవ్ ఏక్సిడెంట్ గూర్చి ఇటీవల ఓ పత్రికలో ఈ విధంగా తెలిపింది.



అనిల్‌ని మొదటిసారి చూడగానే నేను అతని వేపు ఆకర్షించబడ్డాను. అతనితో మాట్లాడుతుంటే నాకు 'మజా'గా వుండేది. అర్ధరాత్రి వరకు అతనితోనే మాట్లాడ్తూ వుండేదాన్ని. మా మమ్మీ డాడీ నన్నేమి అనేవాళ్ళు కాదు. అందుకే కాబోలు తొందర్లోనే మేమిద్దరం ప్రేమించుకున్నాము. పెళ్ళి చేసుకున్నాక రోమ్, లండన్, కెనడా, అమెరికాకి హనీమూన్‌కి వెళ్ళాము.